

27న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల హృదయ సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఈ నెల 27వ తేదీ మంగళవారం సాయంత్రం మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్‌వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 సంవత్సరాల్లోపు వయస్సు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు నిర్వహించి వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు తమ పేరు నమోదుకు 6281225145కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ వేధింపులకు..

అత్తా కోడలు బలి..!

రుణ వాయిదా చెల్లింపు 15 రోజులు ఆలస్యం - ఇంటిని స్వాధీనం చేసుకుంటామని బెదిరింపులతో తల్లడిల్లిన కుటుంబం

ప్రజాశక్తి - మొగల్తూరు

'కుటుంబ యజమాని ఇంటి నిర్మాణానికి తీసుకున్న రుణం వాయిదా చెల్లింపులో 15 రోజులు ఆలస్యమైంది. అంతే రుణమిచ్చిన ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులు రంగంలోకి దిగి నేరుగా ఇంటికొచ్చారు. వాయిదా సొమ్ము వెంటనే చెల్లించకపోతే ఇంటిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన యజమాని భార్య గుండెపోటుతో శనివారం మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యజమాని తల్లి ఆదివారం ఉదయం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రోజు వ్యవధిలో అత్తాకోడళ్లు మృతి చెందడం ఆ ప్రాంతంలో కలకలం సృష్టించింది. ఈ ఘటన మండలంలోని పేరుపాలెం సౌత్‌లోని బెల్లంకొండవారిమెరకలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలాఉన్నాయి.


సుందర అంజమ్మ (ఫైల్ ఫొటో)


సుందర భారతి(ఫైల్‌ఫొటో)

పేరుపాలెం సౌత్‌లోని బెల్లంకొండవారి మెరకకు చెందిన సుందర ఆంజనేయులు, రవిబాబు తండ్రీ కొడుకులు. రవిబాబు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రవిబాబుకు భార్య, కుమార్తె (4), కుమారుడు (2) ఉన్నారు. రవిబాబు ఇంటి నిర్మాణానికి ఫుల్లన్ ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.5.50 లక్షలు రుణం తీసుకున్నాడు. ప్రతి నెలా రూ.12,500 రుణ వాయిదా సక్రమంగా చెల్లిస్తున్నాడు. ఈ నెల ఆర్థిక ఇబ్బందుల రీత్యా వాయిదా చెల్లించలేకపోయాడు. దీంతో ఈ నెల 23న ఫుల్లన్ ప్రయివేటు ఫైనాన్స్ సంస్థకు చెందిన ఉద్యోగులు ఇంటికి వచ్చి వెంటనే రుణ వాయిదా చెల్లించకపోతే ఇంటిని స్వాధీనం చేసుకుని, వేలం వేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన రవిబాబు భార్య భారతి (24) ఈ నెల 24న తీవ్ర గుండెపోటుకు గురైంది. ఆసుపత్రికి తరలించేలోపు ఆమె ప్రాణాలు కోల్పోయింది. అనూహ్య ఘటనతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ విషయం చుట్టుపక్కలవారికి, బంధువులకు అందరికీ తెలియడంతో రవిబాబు తల్లి అంజమ్మ (57) తీవ్ర మనస్థాపానికి గురైంది. ఆదివారం ఉదయం అంతా పనుల్లో ఉండగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో వారు గుర్తించేటప్పటికే ఆమె విగతజీవిగా మారింది. వరుస ఘటనలతో బెల్లంకొండవారి మెరకలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. రోజు వ్యవధిలో కోడలు, అత్త మరణించడం అందరినీ కలిచివేసింది. సమాచారం అందుకున్న నరసాపురం సిఐ వాడవల్లి సురేష్‌బాబు, మొగల్తూరు ఎస్ఐ ఎం.వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అంజమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు రవిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.


రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


మృతుడి వద్ద రోదిస్తున్న బంధువులు

పేరుపాలెం బీచ్‌లో.. ఇద్దరు విద్యార్థులు మృతి

పుట్టినరోజు వేడుకల్లో అపశృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఇద్దరు విద్యార్థులు సముద్ర స్నానానికి వెళ్లి నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కెపిపాలెంసౌత్ యాళ్లవారిమెరకకు చెందిన యాళ్ల రాజేష్ తన పుట్టినరోజు సందర్భంగా మిత్రులతో కలిసి బీచ్‌కు వెళ్లాడు. సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి కొటికలపూడి అరవింద్ (20), యాళ్ల రాజేష్ (18) లోపలికి కొట్టుకుపోయి గల్లంతయ్యారు. ఈ విషయం తెలియగానే స్థానికులు, పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి సమయంలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అరవింద్ సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. రాజేష్ నరసాపురం వైఎన్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. పుట్టినరోజు నాడే రాజేష్, అతని మిత్రుడు అరవింద్ మృతి చెందడం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.

సిఐటియు రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గణపవరం



భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం కావాలని కోరుతూ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో కేశవరం వంతెన సెంటర్లో వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పి.గోవింద్ మాట్లాడుతూ జనవరి రెండో తేదీన జరిగే మహా ప్రదర్శనలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్నాల శ్రీనివాసరావు, సిరికి శ్రీనివాసు, ఆదిరెడ్డి కన్నారావు పాల్గొన్నారు.

సముద్రతీరం.. అన్యాక్రాంతం

కనుమరుగవుతున్న మడ అడవులు - ఆక్రమణలకు గురవుతున్న తీర ప్రాంత భూములు - పట్టని అధికారులు


పేరుపాలెం తీరంలో మడ అడవులు (దాచిన చిత్రం)

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్, కెపిపాలెం సౌత్ తీరంలోని వేలాది ఎకరాల ప్రభుత్వభూమి అన్యాక్రాంతమవుతోంది. సముద్రతీరంలో గతంలో సుమారు వెయ్యి ఎకరాలకుపైబడి మడ అడవులు ఉండేవి. వాటితోపాటు సుమారు రెండు వేల ఎకరాల అన్ సర్వేల్యాండ్, అసైన్డ్, పట్టాభూములు ఉన్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీరు సముద్రంలోకి ప్రవహించేందుకు వీలుగా గతంలో ఉప్పుటేరులు, క్రీకులు ఉండేవి. వాటి ఆయకట్టులో ఉన్న ఆ భూములన్నీ నేడు ఆక్రమణకు గురయ్యాయి. క్రయవిక్రయాలు జరిగి చేతులు మారుతున్నాయి.

క్రీకులు, ఉప్పుటేరుల ఆక్రమణ

నరసాపురం మండలం బియ్యపుతిప్ప నుంచి మొగల్తూరు మండలం పేరుపాలెం వరకూ గతంలో నల్లీక్రీకు ఉండేది. అది దశాబ్దకాలంగా ఆక్రమణకు గురై రూపం కోల్పోయింది. ప్రస్తుతం తూర్పుతాళ్లు వరకూ కొంతమేర మాత్రమే మిగిలింది. నల్లీక్రీకును అక్రమార్కులు ఆక్రమించుకుని దాని గర్భంలో అక్వాచెరువులు తవ్వారు. ఆక్రమించుకున్న భూములకు పైరవీలు చేసి పట్టాలు సంపాదించిన ఘనులూ ఉన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో మురుగునీరు బయటకెళ్లే మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివాదాల ముసురు..

ఉప్పుటేరు సముద్రంలో కలిసే ముఖద్వారం నుంచి ఆర్ అండ్ రహదారి వరకూ వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రాంతంలో భూములు నిత్యం వివాదంలో నానుతూ ఉంటాయి. ఒక్కో భూమిని ఇద్దరు ముగ్గురు పేర్లపై గతంలో పట్టాలు జారీ చేశారు. దీంతో ఎవరు అసలైన హక్కుదారులో తెలుసుకోవడం అధికారులకు కష్టంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో భూములకు ధ్రువపత్రాలు ఇచ్చేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.

భూముల ఆక్రమణ.. ఆక్వా చెరువులుగా మార్పు..

సుమారు పదిహేనేళ్ల కిందట భీమవరం నుంచి ఒక వ్యక్తి ఇక్కడకు వచ్చారు. అప్పటి నుంచీ ఆయన భూ దందా కొనసాగుతూనే ఉంది. ఆ వ్యక్తి వందలాది ఎకరాలు ఆక్రమించుకున్నారు. ప్రభుత్వ, మడ అడవులు ఉండే అటవీ భూములను ఆ వ్యక్తి ఆక్వా చెరువులుగా మార్చేశారు. ఆయా చెరువుల లీజు ద్వారా ఏటేటా రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. దీంతోపాటు ఆ భూముల విక్రయాలకు పాల్పడుతున్నారు.


మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల బయటపడ్డ నిషేధ జాబితా భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో పేరుపాలెం తీరంలో భూములు కూడా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. దీనికి అధికార పార్టీకి చెందిన గ్రామ నాయకుడే సూత్రధారి అని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపేరున ఆన్‌లైన్‌లో నమోదు (మ్యుటేషన్)న ప్రయత్నం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

భూ యజమానులకూ తప్పని తిప్పలు..

ఆయా ప్రాంతాల్లో పూర్వం నుంచి సాగుచేసుకుంటున్న వారిలో పలువురికి సరైన ధ్రువపత్రాలు లేవు. దీంతో రాజకీయ నాయకులు, అధికార యంత్రాంగం, దళారుల ద్వారా హక్కు పత్రాల కోసం అడ్డదారుల్లో ప్రయత్నిస్తూ వారికి వేల రూపాయలు ముట్టజెప్పి ఏదో ఒక పత్రం సంపాదిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పైసలు మొట్టజెపితే పనవుతుందని తెలిసి రూ.లక్షలు చెల్లించి తమ స్వాధీనంలో ఉన్న భూమిని కుటుంబ సభ్యుల పేరున రిజిస్ట్రేషన్ చేయించేస్తున్నారు.

తీర ప్రాంత భూములకు డిమాండ్..

తీర ప్రాంతం భూములకు ఇటీవల డిమాండ్ ఏర్పడింది. సముద్రం తీరంలో పర్యాటక కేంద్రం, ఉప్పుటేరులకు ఆనుకుని ఉన్న భూముల్లో ఆక్వా సాగు ఆశాజనకంగా ఉంది. దీంతో ఈ ప్రాంతం భూములకు మంచి డిమాండ్ ఉంది. ఈ ప్రాంతంలో జిరాయితీలో సరివే, కొబ్బరి తోటలు ఎకరం రూ.కోటి నుంచి రూ.మూడు కోట్ల వరకూ ధర పలుకుతోంది. జిరాయితీ భూముల్లో తవ్విన ఆక్వా చెరువులో ఎకరం రూ.50 లక్షల వరకూ, ఆక్రమణ, పట్టా భూములు ఎకరం రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ చెల్లించి కొనుగోలు చేసేందుకు వెనకాడడం లేదు.


కొణితివాడలో కోడి పందేలపై దాడి చేసిన పోలీసులు

కొణితివాడలో కోడి పందేలు

పక్కా సమాచారంతో పోలీసుల దాడి
15 మంది అరెస్టు
వైసిపి ప్రముఖులు ఉన్నట్లు సమాచారం

ప్రజాశక్తి - వీరవాసరం

కొణితివాడలో వైసిపికి చెందిన పలువురు ప్రముఖ నాయకులు కోడి పందేలకు ముహూర్తం చేసినట్టు సమాచారం. దీంతో ముందస్తు సమాచారంతో పక్కా ప్రణాళికతో స్పెషల్, స్థానిక పోలీసులు సివిల్ దుస్తుల్లో స్థావరంపై దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. కోడి పందేల వద్దకు సివిల్ దుస్తులలో చేరుకున్న పోలీసులు పందేలు వీడియో తీసినట్టు సమాచారం. ఈ విషయం ఆదివారం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఈ దాడిలో పదిహేను మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడి, కోడికత్తి, పది సెల్‌ఫోన్లు రూ.1,480 నగదు స్వాధీనం చేసు కున్నామని ఎస్ఐ రమేష్ తెలిపారు. అదే విధంగా పందేలు జరుగుతున్న ప్రాంతంలో ఆరు మోటార్ బైకులను, మరో ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే పందేల్లో పాల్గొన్న వారి పేర్లు మాత్రం పోలీసులు బహిర్గతం చేయకపోవడం గమనార్హం. పందేలు నిర్వహిస్తున్న వారిలో సర్పంచులు, మాజీ సర్పంచులు ఉన్నట్టు స్థానికులు చెప్పుకుంటున్నారు.

కాళ్లలో 9 మంది అరెస్టు

కాళ్ల: కాళ్ల లంకరోడ్డులో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడిచేసి 9 మంది కోడిపందేల రాయుళ్లను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కోడి, కోడి కత్తి, రూ.15,800 నగదు, నాలుగు మోటర్ సైకిళ్లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి కేసు నమోదు చేశారు.

రసకందాయంలో రాజకీయం..!

- అధికార వైసిపికి అసంతృప్తి సెగ
- ఇంకా పుంజుకోని టిడిపి
- స్థానిక సమస్యలపై దృష్టి కేంద్రీకరించిన జనసేన
- ఉనికి కోసం బిజెపి, కాంగ్రెస్ పాట్లు
- ప్రజా పోరాటాలే ఊపిరిగా వామపక్షాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికార వైసిపిపై ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకీ పెరుగుతోంది. అదే సమయంలో దాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో ప్రధాన ప్రతిపక్షం టిడిపి ఈ ఏడాదీ అంత చురుగ్గా వ్యవహరించిన దాఖలాల్లేవు. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని వైసిపి భావిస్తుండగా, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే తమకు అనుకూలిస్తాయని ప్రధాన ప్రతిపక్షం భావిస్తోంది. జనసేన జిల్లాలో ప్రధానంగా సేవా కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై పోరాడుతూ బలపడేందుకు యత్నిస్తుండగా బిజెపి, కాంగ్రెస్ ఇప్పటికీ తమ ఉనికిని చాటుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నాయి. ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజాసమస్యలే ఎజెండాగా వామపక్షాలు నిరంతరం పోరాటాలతో ముందుకు సాగుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఈ ఏడాది ఆయా పార్టీల అధినాయకుల పర్యటనలతో జిల్లా రాజకీయం రసకందాయంగా మారింది.

ప్రజావ్యతిరేక విధానాలు, సొంత కుంపట్లతో మసకబారుతున్న వైసిపి ప్రతిష్ట

సంక్షేమ పథకాల అమలుతో వైసిపికి కొంత సానుకూలత ఉన్నప్పటికీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా ఆ పార్టీ ప్రతిష్ట మసకబారుతోంది. ఈ ఏడాది నుంచి అమల్లోకి వచ్చిన పట్టణాల్లో చెత్త, ఆస్తి పన్ను, విచ్చలవిడిగా పెంచిన విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు, వ్యవసాయ విద్యుత్ మీటర్ల అమరికకు కసరత్తు, రహదారుల వ్యవస్థ అధ్వానంగా తయారైనా పట్టించుకోకపోవడం వంటి అనేక అంశాలు వైసిపిపై జనంలో అసంతృప్తిని పెంచాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జిల్లాల విభజన చేసినా ఇప్పటికీ గాడిన పరిస్థితి లేదు. నూతన జిల్లా కేంద్రం భీమవరంలో ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక వరి రైతుల ఇబ్బందులు మరింత పెరిగాయి. రైతులు ధాన్యం అమ్మకంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం సొమ్ము జమ నెలలు తరబడి సాగడంతో ఈ ఏడాది రబీలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఖరీఫ్‌లో తెచ్చిన నూతన ధాన్యం కొనుగోలు విధానం రైతులను నిలువునా ముంచింది. ఆక్వా రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీ జోన్లకే పరిమితం చేయడం, రొయ్య వంద కౌంట్‌కు రూ.240 ధర అందేలా చేస్తామన్నా చేయలేకపోవడం, ఆక్వా మేత ధరలు పెరిగిపోవడం వంటి అనేక పరిణామాలు వైసిపిని వెంటాడుతున్నాయి. పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పంపిణీ వంటివి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. గడిచిన ఆగస్టు, సెప్టెంబర్‌లో వరదలకు పోలవరం నిర్వాసితులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గోదావరి నుంచి తాగునీరు అందిస్తామని ఇచ్చిన వాటర్‌గ్రిడ్ హామీ సైతం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. రోడ్ల వ్యవస్థ అధ్వానంగా మారడంతో జనాల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. 45 ఏళ్ల పైబడిన మహిళలకు ఇస్తున్న చేయూత, అమ్మఒడి పథకాలు ప్రభుత్వానికి కొంత సానుకూలత తెచ్చినప్పటికీ పెరిగిన ధరలు, నూతన విద్యావిధానం అమలు, ఎయిడెడ్ విద్యాసంస్థల విలీనం వంటి వాటిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ సాయం సరిపోకపోవడం, లేఅవుట్లలో పలు సమస్యలు ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడానికి కారణంగా మారాయి.

రెండోవిడత మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెండు మంత్రి పదవులు కేటాయించినప్పటికీ ఏలూరు జిల్లాకు ఒక్క మంత్రి పదవి కూడా కేటాయించకపోవడం చర్చనీయాంశమైంది. ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని, ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మంత్రి పదవులు కోల్పోయారు. చెరుకువాడను కొనసాగించకపోవడం క్షత్రియ సామాజిక తరగతిలో కొంత అసంతృప్తికి కారణమైంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై గెలుపొందిన గ్రంధి శ్రీనివాస్‌కు చివరి నిమిషంలో మంత్రి పదవి చేజారడం సొంత పార్టీపైనే వ్యతిరేకతకు కారణమైంది. ఇక జిల్లా కేంద్రం విషయంలో నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి, మాజీ మంత్రి కొత్తపల్లి



మధ్య సాగిన మాటల యుద్ధం అధిష్టానానికి తలనొప్పి తెచ్చిపెట్టింది. చివరకు పార్టీ నుంచి కొత్తపల్లి సస్పెన్షన్‌కు దారితీసింది. ఇక ఉండి నియోజకవర్గంలో తరచూ ఇన్‌ఛార్జీల మార్పు ఈ ఏడాదీ కొనసాగడం ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో వైసిపి నేత గంజి ప్రసాద్‌ను అదే పార్టీకి చెందిన ఎంపిటిసి బజారయ్య హత్య చేయించడం, ఆ గ్రామానికి వెళ్లిన గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావును సొంతపార్టీవారే నిర్బంధించి దాడికి పాల్పడటం ఆ పార్టీలో నెలకొన్న గ్రూపు విబేధాలను ప్రతిబింబించింది. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్ఎ ఎలిజా, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఈ ఏడాదీ కొనసాగాయి. జిల్లా కేంద్రం ఏలూరులో అయితే మేయర్‌పై, కమిషనర్‌పై సొంత పార్టీ నేత విమర్శలు గుప్పించడం, కార్పొరేటర్ అవినీతి ఆరోపణలు చేయడం వైసిపి ప్రతిష్టను బాగా దెబ్బతీశాయని చెప్పొచ్చు.

బలం పుంజుకోని టిడిపి

ప్రభుత్వంపై వస్తున్న ప్రజావ్యతిరేకతను తమవైపు తిప్పుకునేలా ప్రధాన ప్రతిపక్షం టిడిపి ఇంకా క్షేత్రస్థాయిలో చురుగ్గా కదులుతున్న పరిస్థితి లేదు. రాష్ట్ర నాయకత్వం పిలుపులను అమలు చేయడం తప్ప జిల్లాలోని ప్రజా సమస్యలపై ముందుండి పోరాడటంలో టిడిపి నాయకులు పెద్దగా చొరవచూపిన పరిస్థితి లేదు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ప్రజా సమస్యలపై పోరాడుతూ ముందుకు సాగుతున్నా మిగిలిన నియోజకవర్గాల్లో ఆ పరిస్థితి కన్పించడం లేదు. టిడిపి అధినేత చంద్రబాబు ఇటీవల మెట్ట ప్రాంతంలో మూడురోజుల పాటు చేసిన పర్యటన పార్టీ కేడర్‌లో కొంత ఉత్సాహాన్ని తెచ్చింది. టిక్కెట్ల కేటాయింపు విషయంపై స్పష్టత లేకపోవడంతో ఆశావహుల్లోనూ కొంత స్తబ్ధత నెలకొంది. ఇప్పటికీ ఆ పార్టీలో అంతర్గతంగా ముఠా కుమ్ములాటలు సాగుతుండటం గమనార్హం. చింతలపూడి నియోజకవర్గంలో మాజీ మంత్రి సుజాత, మాజీ ఎంపీ మాగంటి గ్రూపులు వేర్వేరుగానే ఉన్నాయి. పోలవరంలోనూ అదే సమస్య కొనసాగుతోంది. ఉండిలో సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ శివ సోదరులైనప్పటికీ అంతర్గతంగా వేర్వేరు గ్రూపులుగానే శ్రేణులు కదులుతున్నాయి. నరసాపురంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, పొత్తూరి రామరాజు మధ్య విబేధాలు అలానే కొనసాగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కేడర్ ఉన్నప్పటికీ నియోజకవర్గాల్లో నాయకత్వ లోపం టిడిపిని వెంటాడుతోంది.

ఉనికి కోసం బిజెపి, కాంగ్రెస్ పాట్లు

జిల్లాలో ఈ సంవత్సరం కూడా బిజెపి, కాంగ్రెస్ ఉనికిని చాటుకునేందుకు కొటుమిట్టాడుతున్నాయి. ఇటీవల బిజెపి రాష్ట్ర, జాతీయ నాయకులు జిల్లాలో పర్యటిస్తున్న పెద్దగా స్పందన లేదు. పోలవరానికి నిధులివ్వకపోవడం, గ్యాస్, పెట్రోల్, వంటనూనె ధరలు వంటివి పెంపుతో బిజెపిపై జనం మండిపడుతున్నారు. కాంగ్రెస్‌కు ప్రస్తుతం నాయకులు సైతం లేని పరిస్థితి ఏర్పడింది.

సేవా కార్యక్రమాలపైనే జనసేన దృష్టి

ఈ ఏడాది జనసేన జిల్లాలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేయడంతోపాటు స్థానిక సమస్యలపై దృష్టి సారించి ముందుకు సాగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపును విస్తరించడానికి ఆ పార్టీ ముమ్మర ప్రయత్నం చేస్తోంది. ప్రధానంగా గ్రామీణప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు, శ్రమదానాలు ఆ పార్టీకి సానుకూలతను తెచ్చిపెట్టాయి. అయితే ఇప్పటికీ ఆ పార్టీలో కేడర్ సమస్య ఉంది.

ప్రజలకు అండదండగా వామపక్షాలు..

ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా పోరాటాలు ఈ ఏడాది వామపక్షాలు సాగించాయి. జిల్లాలో సిపిఎం ప్రధాన భూమిక పోషిస్తూ సిపిఐ, న్యూడెమోక్రసీ వంటి పార్టీలను కలుపుకుని వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలను సాగిస్తోంది. వరదల సమయంలో నిర్వాసితులను ఆదుకోవడంలో సిపిఎం ముందు వరుసలో నిలిచింది. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం అలుపెరుగని పోరాటం చేస్తోంది. వరి రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ధరల పెరుగుదల, కార్మికుల సమస్యలు వంటి ప్రజాసమస్యలపై నిరంతరం పోరుబాట సాగిస్తూ ప్రజలతో వామపక్షాలు మమేకమై ముందుకు సాగాయి.

గ్రామాల్లో భోగి పిడకల సందడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. పండుగ దగ్గర పడుతుండంతో పెద్దల నుంచి చిన్నారుల వరకూ పిడకలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. వీటి తయారీకి కనీసం మూడు వారాల ముందుగా ఆవు పేడ సేకరించి పిడకలు తయారు చేస్తారు. తరువాత వాటిని ఎండలో ఆరబెట్టి దండగా కుడతారు. ప్రస్తుతం ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరు, నెలమూరు, వెలగలేరు, పొలమూరు, మాముడూరు, సోమరాజు ఇల్లింద్రపర్రుతోపాటు పలు గ్రామాల్లో రైతులు తమ పొలాల్లో భోగి పడకల తయారీలో నిమగ్నం అవుతున్నారు. చిన్నపిల్లలు సైతం భోగి పడకల తయారీ చేయడంలో చలాకీగా పాల్గొంటున్నారు.


ఆవుపేడతో తయారు చేసిన పిడకలు

ప్రమాదకరంగా.. తోలేరు రోడ్డు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో తోలేరు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. వీరవాసరం-పెనుమంట్ర ఆర్అండ్‌బి రోడ్డు నుంచి తోలేరు మీదుగా పాలకోడేరు మండలం వెళ్లేందుకు అనువుగా ఉన్న ఈ మార్గం కొంత మేరకు పూర్తిగా చిద్రమైంది. తోలేరు వెళ్లే మార్గంలో పొలమూరు మురుగు కాలువపై ఉన్న వంతెన సమీపంలో ఈ రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం సార్వా కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మార్గాన్ని ఆధారంగా చేసుకుని పాలకోడేరు మండలం నుంచి వీరవాసరం మండలంలోని పలు రైసు మిల్లులకు ధాన్యం రవాణా జరుగుతోంది. ధాన్యం లోడుతో వస్తున్న లారీలు, ట్రాక్టర్లు, ఎడ్లబళ్లు ఈ ప్రాంతానికి వచ్చే సరికి ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులునాందోళన చెందుతున్నారు. రోడ్డు ఒక పక్కకు కుంగిపోవడంతో పాటు అదే వైపు మురుగు కాలువ ప్రవహించడంతో అత్యంత ప్రమాదకర స్థితి నెలకొంది. ఈ మార్గంలో ఆక్వాసాగు నిమిత్తం మేత, రొయ్యల లోడుతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మరమ్మతులకు మెటీరియల్ దింపి నెలలు కావస్తున్నా ఇంకా పనులు ప్రారంభించలేదు. తోలేరు వెళ్లేందుకే కాకుండా వ్యవసాయ రంగానికి ఎంతో కీలకంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతు పనులు తక్షణం పూర్తిచేసి రోడ్డు మరింత పటిష్టపర్చాలని రైతులు కోరుతున్నారు.


ఒక పక్క కుంగిపోయిన తోలేరు రోడ్డు

వైసిపి పాలనపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - ఉండి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎంఎల్ఎ మంతెన రామరాజు సూచనలతో గ్రామ అధ్యక్షులు కాగిత వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు వైసిపి పాలనపై ప్రజల అభిప్రాయాలను ఆదివారం సేకరించారు. ఈ సందర్భంగా కాగిత వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రాజులపేట ప్రజల నుంచి ప్రభుత్వ వైఫల్యాలపై అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇస్తూ అభివృద్ధిని గాలికి వదిలేసిందని అంటున్నారని తెలిపారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన సిమెంటు, ఇసుక, ఐరన్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బండారు సుబ్బారావు, పోలుబోతు రాము, బొర్రా చిన్నా, కెల్లా చిట్టిబాబు, చిరంజీవి పాల్గొన్నారు.


రాంబాబును పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్ఎ శివరామరాజు

టిడిపి నేత రాంబాబుకు శివరామరాజు పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

టిడిపి సీనియర్ నాయకులు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాజీ ఛైర్మన్ కట్టా రాంబాబును మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు ఆదివారం పరామర్శించారు. ఇటీవల రాంబాబు తల్లి కట్టా మహాలక్ష్మి మృతి చెందడంతో చెరుకువాడ గ్రామంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా గ్రామానికే చెందిన తెలగారెడ్డి సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట పొత్తూరి వెంకటేశ్వరరాజు, మోపిదేవి నాగ శ్రీనివాస్, దూసనపూడి రాంబాబు, బురిడి రవిబాబు, వత్సవాయి సూర్యనారాయణ రాజు ఉన్నారు.


సర్పంచి గేదెల జాన్‌తో కేక్‌కట్ చేయిస్తున్న మాజీ ఎంఎల్ఎ శివరామరాజు

సర్పంచి జాన్‌కు శివరామరాజు పరామర్శ

ప్రజాశక్తి - కాళ్ల

ఇటీవల కలవపూడి సర్పంచి గేదెల జాన్ మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆదివారం ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు మామిడిపూడిలోని సర్పంచి గేదెల జాన్ స్వగ్రహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకోవడం వల్ల ఎక్కువగా ప్రయాణం చేయడం లేదని, ప్రస్తుతం బాగానే ఉందని సర్పంచి జాన్ తెలిపారు. అనంతరం వేటుకూరి వెంకట శివరామరాజు జాన్ చేతుల మీదుగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాయకులు పి.వెంకటేశ్వరరాజు, నంబూరి త్రినాథమూర్తి రాజు, కాలువ వెంకట్రావు, బురిడి రవి పాల్గొన్నారు.

కుట్టులో 70 మంది మహిళలకు శిక్షణ


ప్రజాశక్తి - పాలకొల్లు

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో యలమంచిలి మండలం కలగంపూడి, పోలవరం గ్రామాలకు చెందిన 70 మంది మహిళలు శిక్షణ పొందారని ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 20 మంది మహిళలను గుర్తించి వారికి ఉషా కంపెనీ హైదరాబాద్ వారి దగ్గర హోల్సేల్ ధరకు మిషన్లుకొని లబ్ధిదారులు సగం, ఫౌండేషన్ సగం సొమ్ము భరించేలా మిషన్లు అందించినట్లు తెలిపారు. వసుధ ఫౌండేషన్ వేగేశ్న తాతరాజు, చెరుకూరి సత్యనారాయణ రాజు చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు. మిషన్లు పొందిన లబ్ధిదారులు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

వాజ్‌పేయికి నివాళి

ప్రజాశక్తి - పెనుమంట్ర

నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, వారధి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా సుపరిపాలన దినోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం మార్టేరు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానవత మండల సహాయ కార్యదర్శి బండి ప్రసాద్ వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వాజపాయి అందరి మనిషి అని అన్నారు. ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కుంభా యుగేష్, కళాశాల అగ్రికల్చరల్ ఆఫీసర్ గణపతి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జక్కంశెట్టి భగత్‌సింగ్, జక్కంశెట్టి దుర్గాప్రసాద్, వారధి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కామాక్షి రవి సిన్హా పాల్గొన్నారు.


వాజ్‌పేయికు నివాళు లర్పిస్తున్న నేతలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఆదివారం పలు గ్రామాల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కాళ్ల, కోలనపల్లి, జువ్వలపాలెం, కలవపూడి, పెదఅమిరం, ఏలూరుపాడు తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏలూరుపాడులో డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, మండల అధ్యక్షులు ఏరుబండి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉండి : సమాజంలో ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల క్షమాగుణం కలిగి ఉండాలని మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని కోలమూరు, ఉండి, మహదేవపట్నం, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో క్రిస్మస్‌ను నిర్వహించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహాదేవపట్నం సర్పంచి శ్రీనివాస్ దంపతులు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, బురిడీ రవిబాబు పాల్గొన్నారు.

ఆచంట : క్రీస్తు జననం లోకానికి పర్వదినమిన క్రీస్తు సంఘం సువార్తకులు గాదిరాజు తిమోతిరాజు అన్నారు. మండలంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కందరపల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్‌కట్ చేసి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.


ఆచంట వేమవరంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సువార్తకులు


పాలకొల్లు : పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో క్రిస్మస్ సందర్భంగా ఆదివారం బెత్లహెం పేట క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రేమవిందు కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు చందక సత్తిబాబు, కండవల్లి వాసు, ఏభినేజార్,రామాంజుల పెదమధు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగొండ సర్పంచి నక్కా శ్యామల సోనియా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెంలోని బేతెల్ రిఫార్మ్డ్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో హోం శాఖా మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్రీస్తు కృప ప్రజలందరిపైనా ఉండాలని తెలిపారు. క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పేర్కొన్నారు. ప్రజలందరూ సంతోషంగా, ఆనందంగా క్రిస్మస్ పండుగను జరుపుకోవాలన్నారు. క్రైస్తవ సోదరులు, వైసిపి నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పెదపేటలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రబోధకులు ప్రతి ఒక్కరూ ఈ దేశం గురించి ప్రార్థించాలని కోరారు. ఈ వేడుకల్లో 100 కేజీల క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. పిల్లలకు క్రిస్మస్ కిట్లు పెంచారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్ని జోగయ్య, జనార్ధన్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.


పాలకొల్లు :క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జెడ్‌పి ఛైర్మన్


పాలకొల్లులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ నిమ్మల


నరసాపురంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో నేతలు

వైసిపి పాలన దారుణం : ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు


పట్టణంలో ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఏదోఒక సమస్యతో బాధపడుతున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం 20వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులు, పెన్షన్, టిడ్కో గృహాలను ఏదో సాకు చూపి తీసేస్తున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. వితంతువులు, వికలాంగులకు కూడా రేషన్‌కార్డులు తీసేయడం దారుణమన్నారు. పరిపాలన చేతకాకపోతే దిగండి, అంతేగాని సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని ఆయన జగన్‌ను విమర్శించారు. పండుగ రోజుల్లో కూడా పేదలు పప్పులు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు విమర్శించారు.

నరసాపురం : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలన దారుణంగా ఉందని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు విమర్శించారు. ఆదివారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం 16, నాలుగోవార్డుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, ఇంటి పన్ను దారుణంగా వేస్తున్నారని, కరెంట్ బిల్లులు కూడా దారుణంగా పెంచేశారని స్థానికులు ఆయన వద్ద వాపోయారు. ఈ కార్యక్రమంలో టిడిపి బూత్ కన్వీనర్ కొప్పాడ సత్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి ఆరేటి వేణు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి నేత ప్రసాదరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - ఉండి

వెలివర్రు గ్రామ టిడిపి నాయకుడు ముదునూరి ప్రసాదరాజు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉండి మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు పాల్గొని మాట్లాడారు. ఇటువంటి పుట్టినరోజులు ప్రసాదరాజు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రసాద్ రాజు పార్టీలో క్రమశిక్షణ కలిగి అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి ముదునూరి శ్రీనివాస్ రాజు, నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, మోపీదేవి శ్రీనివాస్, బురిడి రవిబాబు, వత్సవాయి సూర్యనారాయణ రాజు, ముదునూరి వాసు పాల్గొన్నారు.


ప్రసాదరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న శివరామరాజు


అమ్మవారిని దర్శించుకుంటున్న యాత్రికులు

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం ఏర్పాటు చేశారు.

సాగరతీరం.. కోలాహలం

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు బీచ్‌కు ఉదయమే ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. ఆలయాలు దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.


సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆచంట

ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆచంట కచేరీ సెంటర్లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల కొంతవరకూ తమ ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ ఉద్యోగాల పేరిట మోసాలు జరుగుతున్నాయని, యువతీ యువకులు ఆ బారినపడి మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. యువతీ యువకులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే జాప్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే ఆ బాధ్యత తల్లిదండ్రులే వహించాల్సి వస్తుందన్నారు. యువకులు ద్విచక్ర వాహనాలను మితిమీరిన వేగంతో నడిపితే లైసెన్స్‌తోపాటు వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ ప్రసాద్

కైకాలది ప్రత్యేక శైలి

పలువురు నివాళి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజా నాట్యమండలి నాటి వ్యవస్థాపకుడు గరికపాటి రాజారావు ప్రోత్సాహంతో నాటకరంగం నుంచి సినీ రంగానికి వెళ్లిన కైకాల సత్యనారాయణది ఒక ప్రత్యేక శైలి అని ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. సినీ నటుడు కైకాల సత్యనారాయణ సంతాప సభ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 775 సినిమాలోని నటించిన కైకాల తన సినీ జీవితంలో చేయని పాత్రంటూ లేదన్నారు. ఫోకస్ అధ్యక్షులు గొన్నా బత్తుల మల్లేశ్వరరావు, కళారంజని జవ్వాది దాశరధి శ్రీనివాస్, పులకాండం ఉగాది మాట్లాడారు. ఆయన రాజకీయాల్లో కూడా ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పోసంశెట్టి మురళీ, కాటి వెంకటరత్నం, ఎం.రమణ పాల్గొన్నారు.

సినీ నటుడు చలపతిరావు మృతికి సంతాపం

చలపతిరావు ఎన్నో నాటకాలు వేసి అనేకమంది ప్రోత్సాహంతో సినీరంగంలో ప్రవేశించారని, ఆయన మృతి నాటక, సినీ రంగానికి తీరని లోటని ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ తెలిపారు. కళాకారులు సంతాపం తెలిపారు.

రంగరాజు మాస్టార్‌కు పురస్కారం

ప్రజాశక్తి - ఉండి

కవి, రచయిత, సాహితీవేత్త లయిన్ గాదిరాజు రంగరాజు విజయవాడ పిబి సిద్దార్థ ఆర్ట్స్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన 5వ ప్రపంచ తెలుగు రచయితల సదస్సులో వినిపించిన కవితకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, గమ్యం-గమనం పుస్తకం అందుకున్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కృష్ణా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), తానా ప్రపంచ సాహిత్య వేదిక, సిలికానాంధ్ర, సిద్దార్థ అకాడమి సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో పాల్గొనే అదృష్టం తనకు దక్కిందన్నారు. సమాజ హితమే సాహిత్యం లక్ష్యం కావాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారని తెలిపారు. మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు సదస్సును ప్రారంభించారని తెలిపారు. ఆచార్య కొలకూరి ఇనాక్, ఫ్రాన్స్ దేశానికి చెందిన డానియల్ నేజర్స్, బోట్స్ వానాకు చెందిన శ్రీదేవి శ్రీకాంత్, అమెరికాకు చెందిన తోటకూర ప్రసాద్, కూచిభోట్ల ఆనంద్, సింగపూర్‌కు చెందిన మంగిపూడి రాధిక, సినీ రచయిత బుర్రా సాయి మాధవ్, సినీ గేయ రచయిత భువనచంద్ర తదితర ఉద్దండులు పాల్గొన్నారని తెలిపారు. తనకు అవకాశం కలిపించిన కృష్ణా రచయితల గౌరవాధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ జివి పూర్ణ చంద్‌కు రంగరాజు ధన్యవాదాలు తెలిపారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఉండి

యువకునిపై దాడిచేసి గాయపర్చిన సంఘటన ఉండి మండలం ఆరేడు గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరేడు గ్రామానికి చెందిన దానం సురేంద్రకు అదే గ్రామానికి చెందిన బత్తుల గణేష్‌కు మోటార్ సైకిల్ విషయమై వాగ్వివాదం జరిగింది. దీంతో బత్తుల గణేష్ దానం సురేంద్రను గాయపర్చాడు. సురేంద్ర ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.గంగాధర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No.34/2019 in O.S.No.61/2017

Between:
రెడ్డి శ్రీనివాస్ ...D.Hr
And
ఉర్రింకల వీర వెంకట సత్యవర ప్రసాద్ ...J.Dr

ప్రకటన

డిక్రీ హోల్డర్ అయిన రెడ్డి శ్రీనివాస్ గారు, J.Dr అయిన ఉర్రింకుల వీర వెంకట సత్యవర ప్రసాద్‌పై డిక్రీ పొంది డిక్రీ బాకీ మరియు ఖర్చులు వసూలు నిమిత్తం E.P షెడ్యూల్ దాఖలా ఆస్తిని వేలం వేయించడం ద్వారా రాబట్టుకొనుటకు E.P దాఖలు చేసిన దర్మిళా శ్రీకోర్టు వారు ది.20-1-2023వ తేదీన వేలం వేయుటకు నిర్ణయించినారు. E.P షెడ్యూల్ స్థిరాస్తిని వేలం ద్వారా కొనుగోలు చేసుకొనుటకు ఇష్టత ఉన్నవారు ది.20-1-2023వ సం॥రం తేదీన గం॥10.30 లు లగాయిత్తు వేలంలో పాల్గొని వేలం పాట ద్వారా కొనుగోలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్: పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం జిల్లా రిజిస్ట్రర్, పెంటపాడు S.R.O ఉంగుటూరు మండలం, వెంకటాద్రి, అప్పారాంపురం గ్రామం పరిధిలో గల రెవిన్యూ సర్వేనెం.114/2A, డోర్‌నెం.2-40 సమీపమున గల పురా య.0.47 సెంట్లులో య.0.25 సెంట్లు (1210 చదరపు గజములు) స్థలంలో 403.33 చదరపు గజములు స్థలములో J.Drకు గల 1/3వ వంతు యింటి స్థలమునకు హద్దులు:

తూర్పు: కట్టా కృష్ణమూర్తి గారి భూమి 145'
దక్షిణం: పెద్ద ఏసుపద్మ మరియు రోడ్డు 75'.2''
పడమర: పొట్టి సుబ్బారావు 145',
ఉత్తరం : ఇరిగేషన్ బోది 75'.2''

పై హద్దులు మధ్య 403.33 చ॥గ॥ స్థలములో J.Dr కు గల 1/3వ వంతు హక్కు మరియు యావత్తు యిజ్‌మెంటు హక్కులతో సహా

Vemana Dhana lakshmi
Advocate for DHr
11th ward, Vinayaka Nagar,
Tadepalligudem. Tadepalligudem.
Dt.26/12/2022 Ph.9948344437